'పోన్లెండి. అక్కర్లేదు. మానవత్వం అంటూ యింకా ఎక్కడుంది లోకంలో! శరీరం ముక్కలూ చెయ్యగలరు. అతకనూ గలరు! గుండె రెండు ముక్కలయితే! చెయ్యవలసిందేదో నాకూ తెలుసు. మీరు వెళ్ళండి.'

ఇంక నోరెత్తడానికి నాకేం సాకు కనిపించలేదు. ఆమెను బతిమాలి, లాడ్జికి తీసుకెళ్ళేను. వెనక మెట్లనుంచి మేడమీదికి తీసికెళ్ళేను. అదృష్ట వశాత్తూ మమ్మల్నెవరూ పరిశీలించినట్టు లేదు. నేను కేరేజి తీసుకువెడు తుంటే ఆమె నన్ను వారించింది.

'నేనేం తీసుకునే స్థితిలో లేను. నాకు మీరిచ్చే ఆతిధ్యం నేను చెప్పిందల్లా వినడమే. పెద్ద ఫ్లాస్కు ఎక్కడైనా ఉంటే సంపాదించి పట్టినన్ని కప్పులు స్ట్రాంగ్ కాఫీ పోయించుకురండి. అది చాలు.'

అక్షరాలా ఆవిడ చెప్పినట్టే చేశాను. అహంకారినని అందర్లో పేరు బడిన నేను బొత్తిగా ఓ ఆడది ఎలా చెబితే అలా చేస్తున్నా నేమిటి-అని పించింది. భోంచేసి వస్తూంటే, నాకు నేనే జవాబు చెప్పుకున్నాను మళ్ళీ. మొహం మీది స్ఫోటకం మచ్చలు లేవనుకుంటే, ఈ అమ్మాయి నన్ను బాగా కలవరపెట్టిన చిన్నదానికి దగ్గిర చుట్టమే. సందేహం లేదు. అదే గొంతుక. అదే నడక. ఆఖరి ఫీటు అమ్మాయికీ ఈమెకీ చాలా పోలికలు ఉన్నాయి.

నే ననుకున్నది నిజమేనని ఈ అమ్మాయి ఒప్పుకుంది.

ఆ మేజిక్ చేసే అమ్మాయి పేరు రీటా. ఈ అమ్మాయి ఆమె కవల చెల్లెలు. పేరు రోజా. ఆ ఆఖరి ప్రదర్శన వీళ్ళిద్దరూ కలిసి చేస్తా రుట.

నా ఆశ్చర్యాని కంతులేకపోయింది.

ఇద్దరూ కలిసి చెయ్యడమేమిటి!

నా ఆశ్చర్యం చూసి రోజా ఒకటే నవ్వు.

"మీలాంటి ఫూల్స్ హాలు అంతా నిండి ఉండగా మా ప్రదర్శనల కేం లోపం? నరకడానికీ అతకడానికీ మా బాస్ ఏమయినా శివుడా, బ్రహ్మా? అసలు నరకడం అంటూ జరిగితే కదా అతకవలసిన అవసరం! పెద్దవారు. నేనిలా అంటున్నానని ఏం అనుకోకండి."

ఆ విద్య ఎలా ప్రదర్శిస్తారో రోజా పూసగుచ్చినట్టు చెప్పింది.

